# రాక్షసులు

"ఉపేంద్ర"

వీధిలో పెద్దగా ఏడుపులు విని సరళ ఉలిక్కిపడి నిద్ర లేచింది. మేడమెట్లవైపు అలికిడైనట్లు వినిపిస్తే అటు చూసింది. చిన్న తమ్ముడు మేడ మీదికి పరుగెత్తుకు వచ్చాడు.

"ఏమిటిరా అది వాసూ!" అంది సరళ ఆదుర్దాగా.

"వదిన బావిలోపడి చచ్చిపోయిందే అక్కా"

"వదిన పోయిందా!" సరళ పెద్దకేక పెట్టింది.

సరళ గుండె గబగబా కొట్టుకొన్నది. తొందరగా మేడమెట్లు దిగి క్రిందికి వెళ్ళింది. అప్పుడే బావిలోనుంచి తీసిన శవాన్ని చాపమీద గుడ్డవేసి పడుకో బెట్టారు. పక్కన జానకమ్మ, కూతురు రత్తమ్మ కూర్చుని పెద్ద పెట్టున ఏడుస్తున్నారు. బ్రతికున్నన్నాళ్ళు వదినను బాధలు పెట్టిన అమ్మ, అక్కయ్యా నేడు ఆమె మరణించగానే అమితంగాదుఃఖించటం సరళకు వింతగాతోచింది. సరళలో వారంటే వొకవిధమైన ద్వేషంరేకెత్తింది. వదిన పోయిందనే దుఃఖము ఎక్కువయి సరళ గొల్లుమని ఏడ్చింది. అప్పటికే పక్కయిళ్ళవాళ్ళు నలుగురూ పోగయినారు. జానకమ్మగారు వాళ్ళనుచూసి మరింత ఏడుస్తున్నది.

సరళ శవం వంక చూసింది. అస్తమించిన వదిన ముఖంలో అమాయికత్వము మూర్తీభవించి వుంది. పాపం! బ్రతికున్నన్నాళ్ళు సుఖం ఎరుగని ప్రాణి! సుకుమారమయిన ఆమె దేహం ఎంత మొద్దుబారి పోయిందో!

సరళలో మనోవేదన ఎక్కువయింది. వదిన ఆత్మహత్య చేసుకున్నదా! అవును! ఎందుకు చేసుకోదు? రాక్షసుల్లాగా పీడించుకుతినే అమ్మ, అక్కయ్య లాంటి వాళ్ళు యింట్లో వుండగా ఆమెకు మనశ్శాంతి ఎట్లా వుంటుంది. వాళ్ళలో మానవత్వంలేదు.

"దాన్ని కన్నకూతురులాగా చూసుకునే దాన్నమ్మా!" అంటోంది అమ్మ మరింత ఏడుస్తూ.

ఎంత అబద్ధం! సరళయింక అక్కడ వుండలేక పోయింది. గబగబా మేడమెట్లెక్కి తనగదిలోకి వెళ్ళిపోయింది. దిండులో ముఖం పెట్టుకుని అమితంగా ఏడ్చింది.

## 2

సుశీలకు పెళ్ళిఅయేటప్పటికి పదహారేళ్ళుంటాయి. పెద్ద కట్నాలు భరించలేక ఆమెతండ్రి పరంధామయ్యగారు సుశీల పెళ్ళి విషయంలో అశ్రద్ధచేశారు. చివరికి తను తూగలేక పోయినా అయిదువేల కట్నంతో మంచి సంబంధమే చేశాడు. పిల్లవాడు బి. ఏ. చదువుతున్నాడు. ఆస్థికూడా అంతా కలుపుకుని పదిహేను ఎకరాలదాకా వుంది. బెజవాడలో స్వంత ఇల్లుకూడా వుంది. పిల్లవాడి తండ్రి శివరామయ్యగారు పెద్ద ఉద్యోగం చేసి రిటైరయి నలుగురిలోనూ గౌరవంగా బ్రతికిన మర్యాదస్థుడు.

పెళ్ళి సక్రమంగా జరిగిపోయింది. వెంటనే సుశీల కాపురానికి వెళ్ళింది. వెళ్ళిన నెలరోజులకే వాసుకి జబ్బు చేసింది. డాక్టర్లు టైఫాయిడ్ అని తేల్చారు. కోడలు వచ్చిన వేళా విశేషం ఎలాంటిదోకాని చక్కగా తిరుగుతున్న పిల్లవాడు మంచం పట్టాడని జానికమ్మ దిగులుపడింది. ఆమెలో కోడలంటే వొకవిధమైన ద్వేషం అంకురించింది. కోడలే జబ్బుకు కారణమని నమ్మింది.

పిల్లవాడి పరిస్థితి ప్రమాదకరంగా వుంది. డాక్టరు రోజూవచ్చి ఇంజక్షన్ ఇచ్చి వెడుతున్నాడు. సుశీల వాసు పోషణ భారం తనమీద వేసుకుంది. రాత్రిపూట అత్తగారు నిద్రపోయినా తాను మేల్కొనివుండి వాసుకు అన్ని ఉపచారాలు తానే స్వయంగా చేస్తున్నది.

నెలరోజులలో జబ్బు తగ్గుముఖం పట్టింది. డాక్టరు ఆరోజు పత్యం పెట్టమన్నాడు. వాసును దగ్గర కూర్చో పెట్టుకొని సుశీల జావ తాగిస్తున్నది. ఇంతలో శివరామయ్యగారు లోపలికి వస్తూ—

"వాసును మళ్ళీ బ్రతికించావమ్మా నువ్వు" అన్నారు.

"నాదేముంది మామయ్యా! డాక్టర్లే వాసుప్రాణం నిలిపారు" అంది సుశీల గ్లాసు కింద పెడ్తూ.

"వదినకు ఆ క్రెడిట్ అక్కర్లేదల్లేవుంది నాన్నా" అంది సరళ చదువుతున్న పుస్తకం మూసివేస్తూ.

"ఏమీటి క్రెడిట్ అంటున్నారు. ఎవరికి?" అంటూ చలపతిరావు ముఖం తుడుచుకుంటూ లోపలకు వచ్చాడు.

"ఇంకెవరికి! నీ భార్యకేరా! సుశీల లక్ష్మీవంటిదిరా. ఆ అమ్మాయి చేతి చలువ వలన వాసుకు జబ్బు తొందరగా నయమయింది"

"నన్నుమరీ పొగిడేస్తున్నారే" సుశీల నవ్వుతూ దొడ్లోకి వెళ్ళి పోయింది.

## 3

ఆయేడు సరళ స్కూలుఫైనలు ప్యాసయింది. వెంటనే కాలేజీలో చేరింది. వాసును హైస్కూలులో ఫస్టుఫారంలో చేర్చారు. చలపతిరావు కూడా ఆయేడే బి. ఏ. ప్యాసయి వుద్యోగంలో చేరాడు.

భర్త ఆఫీసు వేళకు సుశీల ప్రత్యేకంగా వంట చేసి పెడ్తోంది. అందులోనే సరళ, వాసూ నాలుగు మెతుకులు తిని ఎవరి దోవన వాళ్ళు వెళ్తారు. ఇక మధ్యాహ్నం ఏకంగా అత్తగారే మడికట్టుకుని వండుతుంది. రాత్రిపూట అందరికీ సుశీలే ఉడకేసి పెడ్తోంది. పిల్లా పీచూ లేని రత్తమ్మ యింట్లో ఖాళీగావున్నా ఎప్పుడూ వంట జోలికి పోయేటి కాదు.

రత్తమ్మ చలపతిరావుకు అక్కయ్యవుతుంది. అతనికంటే ఆవిడ వయస్సులో రెండేళ్ళు పెద్ద. ఆవిడ మొగుడుపోయిన దగ్గరనుంచీ పుట్టింట్లోనే వుంటోంది. చిన్నప్పటి నుంచి బాగా గారాబంగా పెరిగిన రకం! ఆ గారాబానికి సహజంగా వున్న గయ్యాళి తనం తోడయి యింటిపని పట్టనట్లుండేది.

సుశీలకు ఊపిరాడ కుండా పని సరిపోతున్నది. ఎంత పనిచేసినా అత్తగారెప్పుడూ మెచ్చుకున్న పాపానపోలేదు. పైపెచ్చు ఆ తల్లీ కూతుళ్ళిద్దరూ అష్టకష్టాలు పెట్టారు. ఆమెకు సరిగా నిద్రాహారా లుండేవికావు. సుశీల వండిన అన్నం కడుపునిండా భోజనం చేసిన ఆ తల్లీ కూతుళ్ళు మిగిలిన అన్నంలో నీళ్ళు పోసేవారు. సుశీల మారుమాట చెప్పకుండా నీళ్ళు పిండేసి ఆ అన్నం తినేది. ఈవిధంగా వారు ఆమెను పెట్టని కష్టం అంటూ లేదు. కాని సుశీల మాత్రం మారు మాటాడకుండా అన్నీ సహించేది.

సంక్రాంతి పండుగ నాలుగురోజులుందనగా సుశీల తండ్రి దగ్గరనుంచి, పండక్కి కూతుర్నీ, అల్లుడినీ పంపించమని ఉత్తరం వచ్చింది. శివరామయ్యగారు ఉత్తరం చూసుకున్నారు.

"వియ్యంకుడి దగ్గరనుంచి ఉత్తరం వచ్చిందే! కూతురినీ, అల్లుడినీ పండుగకి అక్కడికి పంపించమని వ్రాశాడు" అన్నాడాయన భోజనంచేస్తూ.

"ఇప్పుడు పంపించటానికి వీలులేదని వ్రాయండి మనం మాత్రం ఇక్కడ పండుగ చేసుకోముటండీ! ఆవిడ పుట్టింటికిపోయి కూర్చుంటే నేను ఇంటిల్లిపాదిచాకిరీ చేసుకోలేను" అంది జానకమ్మ పులుసు వడ్డిస్తూ.

"అందుకని పంపించటం మానుకుంటామా! అయినా ఆపిల్లకు ఎప్పుడూ ఈ ఇంటి చాకిరీయేనా! పండగవస్తే పుట్టింటికి వెళ్ళడం తప్పా! నీకూతురే అత్తారింట్లోఉంటే పండగకి యిక్కడకి రావాలని నీకు వుండదూ? అలాగే వాళ్ళకీ ఉంటుంది. పోనీ పంపిస్తే మాత్రమేం?"

"పంపిస్తే పంపించుకోండి! మధ్య నేనెందుకు?"

శివరామయ్యగారు మాట్లాడకుండా వూరుకున్నారు. తలుపు చాటునుంచి యిదంతా వింటూన్న సుశీల ఇవతలకు వచ్చి—

"నేను ఇప్పుడు మావాళ్ళింటికి వెళ్ళను మామయ్యా! నాకూ వెళ్లాలని లేదు. సరళకు నాలుగు రోజులనుంచి జ్వరం తగులుతున్నదాయెను. ఆపిల్లను వదిలిపెట్టి వెళ్ళటానికి మనసొప్పటంలేదు. పైగా నేను వెడితే అత్తయ్య చేసుకోలేను. అందుకని నేను రానని వుత్తరం రాయండి.

"సరే నీయిష్టం" అన్నాడు శివరామయ్య తన నిస్సహాయతకు లోలోన దిగులు పడుతూ.

## 4

శివరామయ్యగారికి పక్షవాతం వచ్చి మంచం పట్టాడు. అయనకు జబ్బుచేసినదగ్గరనుంచీ సుశీలే ఆయనకు ఉపచారాలు చేస్తున్నది.

చలపతిరావు ఆందోళన పడుతున్నా, జానకమ్మకు చీమకుట్టినట్లయినా లేదు. భర్తకు జబ్బు అదేనయమవుతుందిలే అనే నిర్లక్ష్య భావం ఆమెలో కలిగించి.

శివరామయ్యగారి పరిస్థితి బాగా విషమించింది. జబ్బు బాగా ఎక్కువయి మనిషి క్షీణించిపోయాడు. ఆరోజు డాక్టరు వచ్చి చూచివెళ్ళాడు.

"డాక్టరు ఏమన్నాడమ్మా ?" అన్నారు శివరామయ్యగారు నీరసంగా.

"డాక్టరుగారా! మీకు త్వరలోనే నయమౌతుందని చెప్పారు" అంది యథాలాపంగా. అబద్ధం చెప్పినందుకు సుశీల మనస్సులో నొచ్చుకుంది. కానీ నిజం చెపితే ఆయన ఇప్పుడే దిగులుపడి కూర్చుంటాడు.

ముసలాయన మూలుగు తగ్గలేదు. చలపతిరావు ఆదుర్దాపడి డాక్టరును పిలుచుకువచ్చాడు. ఆయన రావటం చూసి పక్కభాగంలోవున్న ప్లీడరుగారు కూడా వచ్చారు. అంతా గదిలోకి చేరారు. డాక్టరు పరీక్ష చేసి యింజక్షన్ యిచ్చాడు. కొద్దిగా తెలివి వచ్చింది. అప్పుడే శివరామయ్యగారు స్వయంగా ఆర్జించిన యావదాస్తినీ పెద్దకొడుకు పేరున వీలునామా వ్రాయించారు.

## 5

శివరామయ్యగారు పోయి రెండేళ్ళవుతున్నది. సరళ కింకా పెళ్ళి కాలేదు. ఇంటర్మీడియెట్ ప్యాసుకాగానే, చదువు మానేయకుండా బి. ఏ. లో చేరింది.

జానకమ్మగారి మనస్తత్వంలో మార్పేమీలేదు. భర్త పోయిన తరువాత ఆవిడపని విచ్చలవిడిగా వుంది. ప్రతి విషయములోనూ ఆవిడమాటే చెలామణి అవుతున్నది. చలపతిరావు మాట ఇంట్లో సాగడంలేదు.

ప్రొద్దున్న సుశీల చాటలో బియ్యంపోసుకొని గడ్డలు ఏరుతున్నది. జానకమ్మ దొడ్లో పనిచేసుకుంటున్నది.

సరళ నవ్వుతూవచ్చి "వదినా! నువ్వు, అన్నయ్యా యివాళ మా కాలేజీకి రావాలి. ఈరోజు మా కాలేజీ వార్షికోత్సవం. మంచి మంచి ప్రోగ్రాములు వుంటాయి. నేను లైటుసాంగ్సు పాడుతున్నాను. ఇంకా నాటకాలు, ఉపన్యాసాలు అవీ కూడా వుంటాయ్. ఒకటేమిటి, తప్పకుండా రావాలి. సరేనా ?" అంది.

"నీదంతా మరీ చోద్యమమ్మా! నేనెట్లా వస్తాను. వస్తే మీ అన్నయ్య వస్తారులే" అంది సుశీల.

"ఏం అలా అన్నావు ?"

"నే వస్తే యిక్కడ వంటెవరు చేస్తారనుకున్నావు. పగటిపూట అత్తయ్యేవండుతున్నదాయెను. రాత్రిపూటన్నా నేను చేయకపోతే ఏలా ?"

అమ్మంటే వదినకు ఎటువంటి భయభక్తులువున్నాయో ఆమాటలో అర్థమైంది. వదినకు స్వేచ్ఛలేదు.

నెలరోజులు గడిచినాయి. చలపతిరావు వొకసారి ఆఫీసు పనిమీద అర్జంటుగా గుంటూరు వెళ్ళవలసివచ్చింది. రైలు అందదేమోనని ఆదుర్దాపడుతూనే ఇంటికివచ్చాడు. దారిన పోతున్న రిక్షాను ఆపి అందులో ఎక్కి త్వరగా స్టేషను చేరుకున్నాడు. ఇక రైలు బయలుదేరటానికి ఎంతో టైములేదు. చలపతిరావు తొందరగా టిక్కెట్టు తీసుకొని ప్లాటుఫారం వైపుకు పరుగెత్తాడు. అప్పటికే రైలు కూతవేసి బయలుదేరింది. ఆ బండి అందితేనేకాని సాయంత్రానికి తను తిరిగి రాలేనని మనస్సులో బాధ పడుతూ మరింత త్వరగా పరుగెత్తాడు. రైలు వేగం హెచ్చింది. చలపతిరావు లెక్కచెయ్యకుండా అలాగే రొప్పుతూ వెళ్ళి ఒక పెట్టెదగ్గరవున్న కడ్డీ పుచ్చుకున్నాడు. కాని పట్టు తప్పిపోయింది. అంతే! చలపతిరావు జారి చక్రాలక్రింద పడిపోయాడు. అదిచూసి బండిలోనివాళ్ళు గొలుసు లాగారు. రైలు ఆగిపోయింది. పట్టాలమీదనుంచి అతనిని బయటకు తీశారు. అప్పటికే ప్రాణంపోయింది.

అనుకోకుండా వచ్చిన ఈ ఘోరవిపత్తు ఆ కుటుంబాన్ని దుఃఖముతో క్రుంగతీసింది. సుశీల దుఃఖానికి మితి లేకుండా వుంది. టెలిగ్రాం చూచుకుని సుశీల తల్లి, దండ్రులు గుండెలు బాదుకుంటూవచ్చారు. చిన్నవయస్సులోనే తన కూతురుకు వైధవ్యం ప్రాప్తించిందని పరంధామయ్యగారు విలవిలా ఏడ్చాడు.

సుశీల మనస్సును దిట్టపరచుకొంది. తనకు ఆనందం లేనప్పుడు ఇతరులను కూడా బాధపెట్టడం దేనికి. లేని ఆనందం తెచ్చి పెట్టుకొని చిరునవ్వుతో విధి వ్రాతకు తలవంచింది.

జానకమ్మ మనస్సును రాయి చేసుకుంది. కొడుకు కర్మ బాగుండక పోయాడని నమ్మింది. అలా అనుకొని మనస్సును తృప్తి పరచుకొంది. కాని మరుక్షణంలోనే కొడుకు అకాల మరణము మనస్సుకుక్షోభ కలిగిస్తున్నది.

జానకమ్మకు నూతన పరిస్థితులు చికాకును కలిగిస్తున్నాయి. వాటితో సరిపెట్టుకోలేక ఆవిడ తన ఇంటికి ఏదో పీడ పట్టుకుందని నమ్మింది. ఈ భావం ఆమెకు కలిగినప్పుడు మనస్సు పరిపరి విధాలపోతున్నది బహుశ కోడలు జాతకం మంచిది కాదేమో! అందువలనే తమకీ ఇక్కట్లు కలిగివుంటాయి. లేకపోతే ఉద్యోగం చేస్తూ చేస్తూ వున్న పాతికేళ్ళ కొడుకు ఏజబ్బూలేకుండా యిట్లా మాయమౌతాడా! ఇందులో ఏదో రహస్యముంది.

ఈ అనుమానానికి తగ్గట్టు సుశీల ఆ ఇంట్లో అడుగు పెట్టిన వేళావిశేషం ఎలాంటిదో కాని, నాలుగేళ్ళలోనే జానకమ్మ భర్త కొడుకు పోయినారు. ఇది ఆవిడకు దృష్టాంతరంగా తోచి మనస్సులో రకరకాల ఆలోచనలు బయలు దేరినాయి. సుశీలమూలంగానే తమ ఇంటికి పీడ పట్టుకుందని ఆమె నిశ్చయించింది.

జానకమ్మకు ముఖ్యంగా తన ప్రాణంమీద భయము పట్టుకొంది. సుశీల మూలంగా ఇంట్లో ఇద్దరు పోయిన పుడు, తను మాత్రం సరిగా వుంటానని నమ్మకమేది? ఈ భావం ఆమెలో కలిగి సుశీలను చూచినపుడు మృత్యు వును చూసినట్లు లోలోన భయపడుతున్నది. ఇలా ఆవిడ కుఎందు భయపడుతున్నదో ఇంకొకరికి అర్థం చేసుకొన టం కష్టం. వృద్ధాప్యం వచ్చిపోయిన శివరామయ్యగారి మర్ణానికి, కర్మవశాత్తు పోయిన చలపతిరావు మరణా నికి సుశీల కారణమెలా అవుతుందో ఆమెకే బోధపడాలి కాని, ఆమె వూహించిన దానిలోనే ఆమెకు సత్యం గోచ రించింది. సుశీల బెడద తప్పించుకుంటేనే, తనకు మనశ్శాంతి చేకూరుతుంది.

తమ్ముడు రాఘవయ్యను చాటుగాపిలిచి జానకమ్మ తన మనస్సులోని బాధ బయటపెట్టింది. ఆయనకూడా ఆమె నమ్మకం నిజమని నమ్మాడు. ఆమె వూహలకు ప్రోత్సా హం కలిగించాడు. అంతేకాదు! ఆయన మనస్సుకు మరో ఆలోచన తోచింది. సుశీల బెడద తప్పించుకుంటే చలపతిరావు పేరనున్న ఆస్థి అంతా కుటుంబానికి చెందు తుంది. ఇక అప్పుడు సుశీల దయాభిక్షపై జానకమ్మ ఆధారపడి ఉండనక్కరలేదు. ఈ సలహా జానకమ్మకు బాగా నచ్చింది. ఆవిడకు బ్రహ్మానందమైంది. ఆమె దృష్టిలో ప్రాణంకంటే ఆస్తికి విలువ ఎక్కువైంది.

ఆ రాత్రి సుశీల మామూలుగా తానే వంట చేసింది. రాత్రి ఎనిమిది గంటలవేళ రాఘవయ్య వొక పొట్లం తీసుకువచ్చి జానకమ్మకు ఎవరూ చూడకుండాయిచ్చాడు.

రాఘవయ్య భోజనంచేసి వెళ్ళి పడుకున్నాడు. ఆయన అటు వెళ్ళగానే సుశీలను మేడమీదికిపోయి సరళను పిలుచుకురమ్మని జానకమ్మ పంపించింది. వాళ్ళు వచ్చే లోపుగా జానకమ్మ తనే స్వయంగా అందరికీ వడ్డించింది. సుశీల పెట్టుకునే కంచంలో రాఘవయ్య తెచ్చినది కాస్తా కలిపి తిరిగి వచ్చి తన యథాస్థానములో కూర్చుంది. అంతా భోజనంచేసి వెళ్ళిపడుకున్నారు. సరళ మేడమీదికి వెళ్ళిపోయింది. సుశీల వెళ్ళి తన గదిలో పడుకున్నది.

"తెల్లవారిన తరువాత సుశీల ఎలా పోయిందని అడుగుతారేమో! నాకు తెలియదని చెప్పు! అంతగా మరీ అడిగితే ఆ పిల్ల మొగుడుపోయిన దగ్గరనుంచీ దిగులుగా వుంటోంది. అందుకని ప్రాణం తీసుకుందేమో నని చెప్పు! సరేనా!" అని రాఘవయ్య ఆమె చెవిలో చెప్పాడు.

రాత్రి పన్నెండవుతుందేమో! సుశీలకు విపరీతమైన బాధ కలిగింది. పిలిచినా పలికే దిక్కులేకుండా ఆ గది లోనే బాధపడింది. మృత్యువుతో పోరాడి తెల్లవారకట్ల ప్రాణం విడిచింది.

జానకమ్మ తెల్లవారు ఝామున రాఘవయ్యను లేపింది. ఆయన గబగబాలేచి సుశీలను ఎత్తికెళ్ళి ఎవరూ చూడ కుండా భావిలో పడేశాడు.

తెల్లవారగానే జానకమ్మ గొల్లుమన్నది. సుశీల కనపడటం లేదని ఏడ్చింది. నలుగురూ పరుగెత్తుకు వచ్చి అన్నిచోట్లా వెతికారు. చివరికి దొడ్లో భావిలో శవం కనపడింది. రాఘవయ్య తనే భావిలోకి దిగి అందరూ చూస్తూవుండగానే శవాన్ని బయటకు తీశాడు.

## 6

పదిగంటలు కావస్తున్నది. రాఘవయ్య అటూ యిటూ హడావుడిగా తిరుగుతున్నాడు. సుశీల తల్లి దండ్రులు రాలేదు. ఎండ తీక్షణత ఎక్కువయిపోతున్నది. శవాన్ని తీసుకువెళ్ళటానికి అన్ని ఏర్పాట్లుచేసి బయలుదేరారు.

సరళ అప్పటికి మేడదిగి కిందికి వచ్చింది. శవం గేటుదాటి వెళ్ళిపోయింది. సరళ గేటుదాకావచ్చి, వది నను ఆఖరిసారిగాచూసి మనస్సులో శ్రద్ధాంజలినర్పించిది. కంటికి శవం కనపడేంతవరకూ అలాగే నుంచుండి పోయింది.

---